# కథ ఆశయం

“ఓసేవ్! అబ్బాయి దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. ఇలారా!” అంటూ పిలిచారు అవధాని.

కొంగుతో చేతులు తుడుచుకుంటూ, “ఈసారైనా పెళ్ళికి ఒప్పుకున్నాడా?” ఆత్రంగా అడుగుతూ భర్త పక్కన వచ్చి కూర్చుంది పార్వతమ్మ.

“ఇంకా మధు వ్రాసిన ఉత్తరం చదవందే?’ అన్నారు అవధాని.



-గరిశకుర్తి రాజేంద్ర

“అబ్బా! త్వరగా చదువుదురూ” భర్తను తొందర పెట్టింది పార్వతమ్మ.

“ఊ!ఊ!” అంటూ జాగ్రత్తగా కవరువిప్పి ఉత్తరం పైకి చదవసాగారు అవధాని.

పూజ్యులైన అమ్మానాన్నలకు,

నమస్కారములు.

మీరు క్షేమమని భావిస్తాను. అనుకోని పరిస్థితుల్లో తప్పనిసరై ఇక్కడో అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాను. సెలవుల్లో నేను వచ్చాక వివరాలు చెప్తాను. క్షమించి ఆశీర్వదిస్తారని, నా పెళ్ళి ప్రయత్నాలు ఆపగలరని కోరుతూ...

-మీ కుమారుడు మధు

ఉత్తరం చదవటం పూర్తి చేసిన అవధాని గారికి మధుపై పట్టలేనంత ఆగ్రహం కలిగింది.

“చూశావా? నీ కొడుకు చేసిన నిర్వాకం” అంటూ భార్యపై విరుచుకు పడ్డాడు.

★ ★ ★

“అక్కడికే ఆ తప్పేదో నేనే చేసినట్లు నాపైకి ఒంటికాలుపై లేస్తారెందుకు? వాడు చేసిన వెధవపని నాకుమాత్రం ఇష్టమా ఏమిటి?” ఉక్రోషంగా అంది పార్వతమ్మ.

“కలికాలం! వెధవబుద్ధులు. ఒక్కగానొక్క కొడుకని గారాబం చేశాము. కష్టపడి బాగా చదివించాం. తీరా పెళ్ళి విషయం వచ్చేసరికి మన అనుమతి, అభిమతం అవసరం లేకపోయింది వాడికి.” బాధగా అన్నారు అవధాని.

“అడ్డాలనాడు బిడ్డలుగాని గడ్డాలనాడు కాదుగా” నిట్టూర్చింది పార్వతమ్మ.

అలా తమ కొడుకుచేసిన పనికి రకరకాలుగా బాధపడి, చేస్తోన్న పెళ్ళి ప్రయత్నాలు మానుకొని ఒకరినొకరు ఓదార్చుకున్నారు ఆ వృద్ధ దంపతులు. తమ పెద్దరికాన్ని ఖాతరు చేయలేదని వాపోయారు. అప్పుడప్పుడూ మధు ఉత్తరాలు వ్రాసినా జవాబు వ్రాయకుండా తమ నిరసన ప్రకటించారు.

మార్పేమీ లేకుండానే మూడువసంతాలు

గడిచాయి. హఠాత్తుగా "నేను ఫలానా రోజున వస్తున్నా' నంటూ టెలిగ్రాం ఇచ్చాడు మధు.

"చాలా రోజుల తర్వాత వస్తున్నాడు బాబు. వాడినేమీ అనకండి. అయిందేదో అయిపోయింది." వేడుకుంది భర్తను పార్వతమ్మ.

అలాగేనంటూ తలూపారు అవధాని.

★ ★ ★

ఇంటి ముందు టాక్సీ హారను వినబడడంతో కొడుకు కోసమే ఎదురుచూస్తూ కూర్చున్న అవధానిగారు, కొడుకు టాక్సీదిగి తనవైపు రావడం గమనించి బింకంగా పత్రిక అడ్డంపెట్టుకున్నారు.

"ఆ లగేజీలు లోపల పెట్టవోయ్" అంటూ డ్రైవర్‌కు చెప్పి "నాన్నగారూ! మీ ఆరోగ్యం కులాసా?" అంటూ తండ్రిపాదాలకు నమస్కరించాడు.

"ఫరవాలేదు" అంటూ మళ్ళీ పేపర్లో తలదూర్చాడు అవధాని కొడుకుపై వస్తోన్న కోపాన్ని ఆపుకుంటూ.

టాక్సీవాడికి డబ్బిచ్చి పంపించి, "అమ్మా!" అంటూ వంటింట్లోకి నడిచి చిన్నపిల్లాడిలా తల్లిని చుట్టేశాడు మధు

"కులాసానా బాబూ?" అంటూ అయిష్టంగానే పలకరించింది పార్వతమ్మ.

"నామీద మీకింకా కోపం తగ్గలేదు కదూ!" నవ్వుతూ అన్నాడు మధు.

"అవన్నీ తీరుబడిగా మాట్లాడుకుందాం. ముందు స్నానం చేసి రా. భోజనం వడ్డిస్తాను. నాన్నగారు కూడా భోంచేయకుండా ఎదురుచూస్తూ కూర్చున్నారు." అంది పార్వతమ్మ.

మధు బాత్రూం వైపు వెళ్ళాక భర్తతో గుసగుసగా "ఒక్కడే వచ్చాడేమిటండీ వీడు. ఆ పిల్లరానందా ఏమిటి?" ఆత్రం పట్టలేక అడిగింది పార్వతమ్మ.

"అవునుమరి! బిలాయిలాంటి దూరప్రాంతం నుండి ఈ పల్లెటూరికి ఎలా వస్తుంది? మన పిచ్చి కాకపోతే?" అన్నారు అవధాని.

తండ్రీ కొడుకులిద్దరూ ముభావంగా భోంచేయసాగారు.

ఇక ఉండబట్టలేక పోయింది పార్వతమ్మ.

"అయిందేదో అయింది. కనీసం కోడలు పిల్లను తీసుకొచ్చావు కాదు! పెళ్ళయ్యాకైనా ఆ అమ్మాయిని చూసే అదృష్టానికి నోచుకోలేదా మేం." నిష్ఠూరంగా అంది పార్వతమ్మ.

ఆమె మాటలకు పెద్దగా నవ్వాడు మధు.

దంపతులిద్దరూ ఒకరిమొఖాలొకరు వింతగా చూసుకున్నారు.

"కోడలివిషయం మేమడుగుతుంటే, అలా నవ్వుతావేమిట్రా?" కోపంగా అన్నారు అవధాని.

"పెళ్ళికాకుండానే కోడలినెలా తీసుకురానూ?" ఎదురుప్రశ్నవేశాడు మధు.

దంపతులిద్దరూ విస్తుపోయారు.

"మరి ఆనాడు నీవు వ్రాసిన ఉత్తరం మాటేమిటి?" ఇద్దరూ ఒకేసారి ప్రశ్నించారు.

"ఓ చిన్న అబద్ధం వ్రాశాను." నవ్వుతూ అన్నాడు మధు.

"అదే! ఎందుకనీ?" దంపతులిద్దరూ ప్రశ్నించారు మళ్ళీ.

"నన్ను క్షమించండి. అసలు నిజం చెబుతున్నాను. ఉద్యోగం రాగానే పెళ్ళిచేసుకోకూడదనీ, కనీసం రెండు మూడేళ్ళు స్వేచ్ఛగా ఉండాలనుకున్నాను. ఈలోగా డిపార్ట్‌మెంటల్ పరీక్షలు వ్రాసి ప్రమోషన్ సాధించాలనుకున్నాను. మీరేమో నా పెళ్ళికి తొందరపెడుతూ, సంబంధాలు వెతకటం ప్రారంభించారు. అందుకే ఇలా ఓచిన్న అబద్ధం ఆడి పెళ్ళి మూడేళ్ళు వాయిదా వేయించగలిగాను. ఈలోగా ప్రమోషన్ సాధించి నెలరోజులు సెలవుపెట్టి మరీ వచ్చాను. ఇప్పుడు చెప్పండి. ఏ పిల్లమెళ్ళో తాళి కట్టాలో?" అసలు రహస్యం బయటపెట్టాడు మధు.

ఏమైనా తమకొడుకు తన పెళ్ళిబాధ్యత తమపైనే ఉంచినందుకు సంతోషించారు, ఆ దంపతులు.

తన ఆశయం నెరవేరడంతో తన తల్లి దండ్రుల ముచ్చట తీర్చడం తన బాధ్యతగా భావించాడు మధు.

ఇహ తమకు నచ్చిన కోడలిని వెతికేందుకు, తమకొడుకునో ఇంటివాడిని చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు ఆ దంపతులు.



## అసలు సంగతి

మిథున్ చిత్రాలు వరసగా ఫ్లాప్ అవుతున్నప్పటికీ ఇంకా కొత్త సినిమాలు అతనివి వస్తూనే ఉన్నాయి. హీరోగా బిజీగానే ఉన్నాడు. కారణమేంటో తెల్సా? అతన్ని తీసుకుని సినిమా తీస్తే ఆ చిత్రానికి సంబంధించిన షూటింగ్ తన స్వంత హోటళ్ళలో చేసుకోనిస్తాట్ట. అంతేకాదు, షూటింగ్ సందర్భంగా యూనిట్ ఉంటానికి రూములు కావల్సి వస్తే సగం ధరకే ఇస్తాట్ట. ఊటీలో మిథున్‌కి స్వంత హోటల్ ఉన్న సంగతి తెలిసిందేగా.

-మౌర్య

